1

ఉపాకాయులు

పారమ్మ చెయ్యి తగలగానే సీతి యింకా ముడుచుకుపోయి 'చలేస్తోందే' అంది. గోతాం అడ్డుగట్టినా అందులోని చిల్లులు, కిటికీగుండా వచ్చే చలి గాలిని అడ్డుపెట్టకుండా వదిలేస్తున్నాయి. సీతి పడుకున్న చింకి గుడ్డ చల్లగా ముద్దయిపోయింది. ఆ గుడిసెకి అతి దగ్గరలో వున్న కోనేరు, నీళ్లున్న రోజుల్లో, చెమ్మ పురకటము, అక్కడవున్న నేలకి అతి సహజమయిన విషయం. చలి రోజూ వున్నదే అయినా, దానికి అలవాటు పడటం సీతికి మహా కష్టం అయిపోతోంది! ప్రొద్దు కుంకి నప్పటినుంచీ, సూర్యోదయం అయేటంత వరకూ చలి అన్ని గుడిసెలతోపాటు సీతి వున్న గుడిసెలో గూడా తిష్ట వేసే వుంటుంది, ఎంత వద్దనుకున్నా సీతి గజగజా వణకని రోజు వక్కటిగూడా వుండదు, చలి కాలం వచ్చిందంటే. దానికితోడు నేలనుంచి వూరే చెమ్మ సుంచులాగా అయిపోయి చలికి భయపడే వాళ్ళని యింకా ఝడిపిస్తూనే వుంటుంది. తెల్లవారినా సూర్యోదయం అయేటంతవరకూ సీతికి లేద్దామని లేదు. అన్నీ వుడిగిన పారమ్మకు చలిబాధ తెలియటంలేదు.

సీతి, పారమ్మ చేతిలోపడి పైకి లేచిన తన చిన్న చేతిని వడిలోకి లాక్కుని యింకా ముడుచుకుని పడుకుంది; పైకి పాకిన పరికిణీని చీలమండదాకా కిందకి లాక్కుంటూ, నిద్రలోవున్న సుఖం లేచిన తర్వాత వుంటుందని నమ్మకం కలగటంలేదు సీతికి. నిద్ర కళ్ళల్లో నుంచి ఆ వూరి గడపలన్నీ కూడా వక్కొక్కటే కనబడుతూ మాయమవుతున్నాయి. పారమ్మ వాకిట్లోకి వెళ్ళి. వచ్చి సీతిని బలవంతాన లేవదీసి కూర్చోబెట్టి 'ఇవ్వాళేమన్నా లేస్తావా లేవ్వా...పండగపూట మరీ వస్తోందే' అంది బలవంతాన కూర్చున్న సీతిని వదిలేస్తూ. సీతి వదలటంతోనే కూలబడి యిక లాభం లేదని పక్కసారిగా నిలబడి ఆవలించింది. కళ్ళంటుకుపోయి తెరవనివ్వలేదు! కళ్లు నలుపుకుంటూ తడబడుతున్న కాళ్ళతో వాకిలిదాకా వచ్చింది. కనురెప్పల నడుమనుంచి ప్రపంచమంతా పంచరంగులతో కనిపించింది. ఏడుపులోనే పేలవంగా నవ్వు వచ్చింది.

పారమ్మ వాకిట్లో పడివున్న కుండ చట్టిని లోపల పడేసి తలుపుకు తాడు కట్టేసి సీతిని వాకిట్లోకి ఈడ్చుకి వచ్చింది. అప్పటిదాక సీతి ముఖం పారమ్మ దృష్టిలో పడనే లేదు. కళ్లు వుబ్బరించి కను కొలకులు ఎర్రగా వున్నాయి. సీతిని భుజాన వేసుకుని రోడ్డుమీదికి బయలుదేరింది. సందు మూలగా వున్న పంపు నీళ్లు అదే పనిగా కారి పోతున్నాయి. సీల విరిగి పోయి పంపు గట్టుమీద వెల్లకిలా పడివుంది. దాన్ని పక్కకు తోసేసి సీతిని మెల్లిగా గట్టుమీదికి దించింది. ఏక ధారగా వస్తున్న నీటిని కొంచెంగా చేత్తో తీసుకుని సీతి కళ్లు తడిపింది. మంటతో కొద్దిగా మూలిగింది సీతి. పారమ్మ కొంగుతో కళ్లు తుడిచి, 'ఏమే సీతి...యిప్పుడు బాగా కనపడు తోందిటే' అంది. సీతి పరికిణీ పైకెత్తి తుడుచుకుని 'ఇప్పుడు బాగానే వుందే...యింక నడిచి వస్తా...పోదామా' అంది.

అది సుకుమారమైన ఆ పాప చిన్ని వేళ్లు పారమ్మ మొరటు వేళ్ళ చుట్టూ పెనవేసుకుపోయినాయి. పాప పది అడుగులు వేసే లోపుగా పారమ్మ రెండడుగులు అతి నిదానంగా వేస్తుంది. తనకంటె ముందు పోతున్న పారమ్మ కుడికాలు వంక చూసి తనుగూడా అంత పెద్దదాన నయితే ఎంత బాగుంటుందా అనుకుంది. ఆ వక్క కారణం వలనగాని పెద్ద దానిగా రూపొందాలని సీతి ఎన్నడూ కోరుకో లేదు. పెద్దవాళ్ళ కుండే బాధ్యతలు లీలగా తెలుస్తూనే వున్నాయి. తనబోటి చిన్ని పాప లుంటే వాళ్ళను గురించి తీసుకోవలసిన శ్రద్ధ తను అనుభవిస్తున్న విష యమే. ఆ సంగతి యింకా వకళ్ళద్వారా నేర్చుకోవలసిన అవసరం లేదు.

సీతి రోడ్డు ఎక్కేదాకా గబగబా నడిచింది గాని, అంతటితో కాళ్ళలో సత్తువ హరించి పోయింది. పారమ్మతో చెపుదామని రెండు మూడు సార్లు చెయ్యి గుంజి ప్రయత్నించింది గాని, పారమ్మకు వున్న ముందు దృష్టి పక్కనే వున్న పాపను చూడనీయ లేదు. తడబడుతున్న అడుగులు పారమ్మ చేతిబలంతో యింకా ఎక్కువ కంపరాన్ని పొంది నాయి. ఒకొక్కసారి రోడ్డుమీద ఈడ్చుకు పోతున్నట్లే వుంటుంది పారమ్మ సీతిని తీసుకుపోయే పద్ధతి చూస్తూంటే. సీతి యింక లాభం

లేదనుకుంది. పారమ్మ చేతిని వదిలించుకుని 'యింక రాలేనే' అంటూ మారాం చేసింది. జారిపోయిన చేతిని మళ్ళీ చేతిలోకి తీసుకుని 'ఎందుకు వస్తావు...తిన్నదరక్క' అంది పారమ్మ. సీతికి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది 'ఎప్పుడమ్మా...రాత్రి అసలు అన్నమే తినలేదుగా' అంది. పారమ్మ గబుక్కున సీతిని చంకలోకి తీసుకుని హృదయానికి హత్తుకుని 'తమాషాకన్నానమ్మా...యిప్పుడు తిందువుగానిలే' అంది. పారమ్మ కంటినుండి జారిన అశృ బిందువు సీతి దృషిలోకి రాలేదు. రెండు చేతులతో గట్టిగా కౌగలించుకుని 'మా అమ్మ చాలా మంచిది' అనుకుంది.

పారమ్మ అడుగులు గబగబా పడుతున్నాయి. సీతి హృదయం గుబగుబా కొట్టుకుంటోంది. పారమ్మ ముందుకు నడిచిపోతుంటే రోడ్డును ఆధారం చేసుకున్న పరిసరాలన్నీ వారిని వదిలి ఎక్కడికో పోతున్నట్లనిపించింది సీతికి. ఎక్కడినుంచో పైనుంచి వచ్చి పడిన సీమ టపాకాయ పారమ్మ ముందుగా 'ఢాం' అని పేలింది. సీతి వులిక్కిపడి వెనక్కు తిరిగి చూచింది. ఎర్రిటి టపాకాయపైన చుట్టినరంగు కాగితాలు చినిగిపోయి చిందర వందరగా పడిపోయినాయి. సీతి-పారమ్మ చంకలోనుంచి కిందికి జారింది. నాలుగు పక్కలా కలయచూచింది. అన్నీ ఎర్రకాగితం పీలికలే. వక ముక్కను పైకితీసి వాసన చూస్తూ 'అమ్మా యిదేమిటే' అంది. సీతి చేతిలోని కాగితంముక్క గాలికి ఎగిరి వచ్చి పారమ్మ కొంగుమీద పడింది. సీతిని చేతుల్లోకి అందుకుంటూ 'సీమ టపాకాయే...కాలుతుందమ్మా' అంది. సీతి చేతుల్ని విదిలించుకొని 'నడిచివస్తానే' అంది. పారమ్మ పట్టుబట్టలేదు సీతి నడక విషయంలో.

చూస్తుండగానే సీతి ముందర యింకొక టపాకాయ పేలింది. పేలక మునుపు దాని ఆకారం ఎట్లావుంటుందో చూద్దామనుకుంది. అంత ధ్వని ఎక్కడినుంచి వస్తున్నదో పసిగడదామనుకుంది. మోత వినబడే టంత వరకూ అది సీమ టపాకాయ అని తెలియలేదు. తెలిసిన తర్వాత రంగు కాగితపు పీలికలు తప్ప టపాకాయ కనిపించలేదు. సీతి గోముగా పార్వతిపైన చెయ్యివేసి 'అమ్మా టపాకాయ నాకోటి...యియ్యవుటే' అంది. పారమ్మ గట్టిగా గదమాయిద్దామనుకుంది. గాని, అసలే నీరసంగా

కదల్లేకుండావున్నప్పుడు మంచిపని గాదని పూరుకుంది. 'అయ్యగారి నడిగి యిప్పిస్తాగా...తొందర పడకు మరి...ఆ...అదుగోచూడు, వక్క నిమిషంలో యిల్లు దగ్గర కొచ్చేస్తుంది...' అంది. సీతి కనబడుతున్న మేడ పై అంతస్థుచూస్తూ, 'మన అయ్యగారి యింటి దగ్గరనేనా...' అంది. 'అవునే మన అయ్యగారి యింటిదగ్గరే' అంది. ఆమె గొంతు గద్గధమైంది. ఆ ధ్వని లోతులను అవగతం చేసుకో గలిగిన లోతు హృదయంకాదు సీతిది. పారమ్మ కొంగు గట్టిగా పట్టుకుని 'అయితే తొందరగాపదవే...' అంటూ అడుగులు తొందరగా వేయటం మొదలు పెట్టింది. పారమ్మ నొవ్వుకుంధి.

చిల్లర దుకాణం వాడు పారమ్మను దూరంనుంచే గుర్తుపట్టాడు. 'ఏం పారమ్మా యిటు రాకుండా నే పోతున్నావు' అన్నాడు. వచ్చే పోయే టప్పుడు పారమ్మను పలకరించటం అతనికి అలవాటు. అందులోనే అతనికి అంతులేని సంతృప్తి. పారమ్మకు కావలసిన చిల్లర సరుకులన్నీ చాలా తక్కువ ధరకే దొరుకుతాయి అక్కడ. ఊరికే యివ్వటానికైనా దుకాణంవాడు వెనుదీయడు గాని, ఆ మాటంటే పారమ్మ ఆ చాయలకు తిరిగి రాదని అతనికీ గట్టిగా తెలుసు. పారమ్మ అతని వైపు రోడ్డు మీద నుంచేచూస్తూ 'యిప్పుడు తొంధర పనిమీద పోతున్నానయ్యా... మళ్ళీ వచ్చి మాట్లాడుతాలే' అంది పమిట కొంగు తలమీదకు మెల్లిగా లాగుకుంటూ. ఆమె నోటినుంచి వెలువడే ప్రతి పదమూ, అతనిలో అణచ బడిన వింత ప్రవృత్తులకు జాగృతి పాడుతుంటాయి. ఎండి పోయిన అతని జీవితంలో ఆదొక్కటే చిగురు టాకు. దానిని చూసు కునే అతను జీవించగలుగుతున్నాడు. ఆ చిగురు ఆకులవుతుందనీ, ఆకుల మధ్య మొలిచిన మొగ్గపూచి ఫలిస్తుందనీ అతని కప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. పారమ్మ అతనితో మాట్లాడుతూ వుంటే, అంతకు మించి అతను జీవితంలో కోరుకొన గలిగినది మరొకటి లేదు. ఈ నాలుగేళ్ళ పరిచయం లోనూ పొంద గలిగింది కూడా అదే. గొంతు శ్రుతి ఇంకా కొంచెం హెచ్చింది.

'రా పారమ్మా...పోదువుగానిలే...మంచి మాటొకటి చెపుతాను'

అన్నాడు. పారమ్మ చీదరించు కుంటున్నట్లు ముఖంపెట్టి 'ఏంటో గొడవ చెప్పరాదూ...నేను పోవాలయ్యా అంటుంటే' అంది దుకాణపు వైపుకి వచ్చి నిలబడింది.

'పండగ కాదు పారమ్మా...చిల్లర సరుకేం తీసుకు పోవూ?'

'వెళ్ళేటప్పుడు తీసుకు పోతా లేవయ్యా...తొందర పనుందని చెప్పటంలా...పిల్లది సీమ టపాకాయలు కావాలంటోంది.'

దుకాణం వాడి ముఖం చిన్నబోయింది. సీమ టపాకాయలు తన దుకాణంలో వుంచనందుకు. దగ్గర దుకాణం వక్కటి గూడా లేదు. పోనీ అక్కడినుంచి తెచ్చి యిద్దామనుకుంటే, పారమ్మ నోరు తెరచి కావాలన్న వస్తువు యివ్వలేక పోయినందుకు–దుకాణం వాడు సంభాషణ పొడిగించటానికి సావకాశం లేకపోయింది. ముఖం విదారకంగా పెట్టి 'నువ్వు వెళ్ళేటప్పుడు రా పారమ్మా...టపాకాయలు తెచ్చి పెడతాగా... అందరు ఎట్లా తీసుకుంటే నువ్వు అట్లాగే తీసుకుందువు గానీలే' అన్నాడు. పారమ్మ దృష్టి యిందాకటినుంచి దుకాణం మూలగా ఉన్న డబ్బా మీదనేవుంది. దానిలో వున్న పొడి ఎర్రగా ధగ ధగ లాడుతోంది. దానిని చూస్తున్న కొద్దీ. కడుపు తరుక్కు పోయి దుఃఖం వెల్లువలై వస్తోంది పారమ్మకు.

'ఏం సెట్టీ...ఆ డబ్బాలోది ఏంటి, అంది. పారమ్మ చూపుడు వేలు సెట్టి దృష్టిని సరిగ్గానైన డబ్బామీదికే తీసుకునిపోయింది. సెట్టి క్షణకాలంపాటు స్తంభితుడైనాడు.

'ఏం లేదు పారమ్మా...దాని సంగతి నీ కెందుకులే' అన్నాడు పారమ్మ వంక సూటిగా చూడటానికి ధైర్యం చాలక.

'అలాగాదు సెట్టీ...అదేమిటో చెప్పరాదూ...కుంకమేనా?' సెట్టి ఎందుకనో గజ గజ లాడాడు. అతని శరీరం అతని స్వాధీనం తప్పి వణకటం ప్రారంభించింది.

'ఎందుకు సెట్టి భయపడతావు. దానితో నాకీనాడు అవసరం కలిగింది...దానికి సరైన ధరనే కట్టియివ్వు...వెల తక్కువలో కుంకం

నాకక్కరలేదు...' అంది. సెట్టి త్రాసు ముందరనుంచి, పైనుంచి వ్రేళ్ళాడుతున్న తాడు పట్టుకుని లేచివచ్చాడు మూలనున్న డబ్బా వైపుకు. పక్క గోడకువున్న మేకు మీద వ్రేలాడుతున్న త్రాసును తీసి పళ్లెంమీద వున్న దుమ్మును గట్టిగా వూదాడు. దుమ్మువున్న స్థానంలోకి కుంకుమ రాబోతున్నదనే టప్పటికి పారమ్మ ఆనందానికి వరవడి లేకపోయింది. అయినా తను తీసుకోబోతూన్న కుంకుమ తూచి యివ్వటానికి సిద్ధపడ్డ సెట్టిని చూచేటప్పటికి ఆమె ముఖం మీద విషాద ఛ్ఛాయలు అలుముకు పోయినాయి. గబగబా దుకాణంలోకి రెండడుగులు వేసి, 'సెట్టి...నా కుంకుమను తూకం తుయ్యొవద్దు...నువ్వు ధరనూ కట్టవద్దు...నా క్కావలసినది నేనే తీసుకుంటాను...' అంది. సెట్టి పక్కకు తొలిగాడు నోట మాట రాక. పారమ్మ కుంకుమ డబ్బాను చేతిలోకి తీసుకుని, మొదటి రెండు వేళ్ళతోనూ ముఖంనిండా అద్దుకుంది. దుకాణంలో పైగా వ్రేలాడ తీయబడ్డ అద్దం ముందరకు పెళ్ళి, ముఖాన పెట్టుకున్న కుంకుమను చూసుకుంది. రూపాయ బిళ్ళంత వున్న కుంకుమ మధ్య మధ్య తళుకు తళుకుమని మెరుస్తున్నాయి చెమికీ ముక్కలు. సీతి పారమ్మ కొంగు పట్టుకులాగి 'నా ముఖానాగూడా' అంటూ ముఖం చూపించింది.

'సెట్టి పాప ముఖాన కొంచెం కుంకం పెడతావా' అంది. పారమ్మ విచిత్ర ప్రవర్తనకు స్తబ్ధుడైన సెట్టి మారు మాట్లాడకుండా వక చిటికెడు కుంకుమ తీసి, సీతి ముఖాన మెత్తాడు. సీతి గూడా అద్దంలో చూచుకొని మురిసిపోయింది. పారమ్మ వైపుకు తిరిగి, 'అమ్మా నువ్వగూడా రోజూ పెట్టుకో రాదుపే' అంది. పారమ్మ సీతిని గట్టిగా హృదయానికి హత్తుకుని బావురుమంది.

సెట్టి కొంచెంగా తమాయించుకుని 'ఏం పారమ్మా...మీ ఆయన వచ్చాడా—' అన్నాడు ఆమె ముఖమండలంలో మెరుస్తున్న తన కుంకుమ వంకచూస్తూ. పారమ్మ చాలా ముక్తసరిగా సెట్టివంక చూస్తూ 'అవును సెట్టీ...వచ్చాడు' అంది. సెట్టి మాట్లాడటానికి భయపడు

తున్నాడు, ఏది మాట్లాడినా దానిలో ఏదో తప్పున్నదని మనస్సు వెక్కిరించి భయపెడుతోంది.

'ఎక్కడున్నాడు పారమ్మా...యింతవరకు చెప్పావుగాదేం,, పారమ్మ ముఖంలో విషాదచ్ఛాయలు లోతుగా పెరుగుతున్నాయి. సెట్టికి తన జీవితపు మోడులోపున్న వక్క చిగురు గూడా గాలికి వూడిపోయి, దానితోపాటు ఎక్కడో పోయి పడుతున్నట్లుగావుంది. కళ్ళనీళ్ళు వచ్చిన పర్యంతం అయింది. నీరు నిండిన కనులు ఆ భారాన్ని మోయలేక బయటి ప్రపంచాన్నంతా బరువుగా చూస్తున్నాయి. 'ఏం పారమ్మా ...అయితే ఈ పిల్లని వాళ్ళ అయ్యా...అమ్మాళ్ళదగ్గరికి పంపించేస్తావా' అన్నాడు. పారమ్మ ఆతనివంక తీవ్రంగా చూసింది. దా ని కతడు భయపడి కాదు గాని 'అమ్మా పోదామే' అంటూ అరుస్తున్న సీతి గొంతుక అతని రక్త నాళాల్లో ప్రతి ధ్వనించి వుడికించి పారేస్తున్నాయి. సీతి పారమ్మ కొంగు లాగుతూ అమ్మా పోదామమ్మా...టపాకాయలకి' అంటోంది. సెట్టి అనుమానం నివృత్తికాలేదు. తనకు వచ్చింది అనుమానమేనా అని యిప్పుడు సందేహంకూడా కలిగి పారమ్మవంక జాలిగా చూస్తూ 'నేనడిగినమాటకు సమాధానం చెప్పవా పారమ్మా' అన్నాడు.

పారమ్మ అతనివైపు కఠినంగా చూసింది. సెట్టి వంచిన తలెత్తకుండానే 'ఏం పారమ్మా...మీ అయనెక్కడవున్నాడో చెప్పవూ' అన్నాడు. పారమ్మ చాలా ముక్తసరిగా 'నాకు తెలియదు' అంటూనే గిరుక్కున వెనక్కు తిరిగి సీతిని బజాన వేసుకుని రోడ్డుమీదికి పెద్ద పెద్ద అడుగులతో బయలు దేరింది.

సీతికి యింతవరకూ మాట్లాడటానికి అవకాశమే చిక్కలేదు: సెట్టివున్నాడంటే ఆ కాసేపు అదే పనిగా మాట్లాడుతూనే వున్నాడు. అదైనా తనకి సందంధించిన విషయాలు చాలా తక్కువగా వున్నాయి యిప్పుడే కొంచెం తీరిక కలిగింది! అది కాకపోయినా దూరంలో కనపడుతున్న మేడ అంతస్తు దగ్గరకు చేరే లోపుగా వుండే సమయాన్ని భరించలేకపోయింది. వెనకగా వెళ్ళిపోతున్న కరెంటు స్తంభాలవైపు చూస్తూ' 'అమ్మా టపాకాయలు అయ్యగారి దగ్గర యిప్పిస్తావు గదుటే,

అంది. సమాధానం వెంటనే వస్తుందని సీతి ఆశించలేదు. కోరుకోలేదు. గూడా—సమాధానం కోసం ఎదురుచూస్తూ కాలయాపన చెయ్యవచ్చు. సమాధానం వెంటనే వచ్చిందంటే రెండో ప్రశ్నకోసం మళ్ళీ ఆలోచించాలి.

పారమ్మ మౌనంగా వూరుకునేటప్పటికి సీతి మళ్ళీ అదే ప్రశ్న అడిగింది. 'టపాకాయలు యిప్పిస్తావు గాదుటే' అంటూ. పారమ్మ ఊఁ అంది. సీతి వక్కనిమిషం ఆలోచించి 'రోజూ ముఖాన బొట్టు పెట్టుకో రాదుటే...బాగుంటుంది' అంది. పారమ్మ మాట్లాడడంలేదు. సీతి యింకో క్షణం ఆగి 'యిందాకా ఆయనెవరో అన్నావు...ఎప్పుడు ఇక్కడికి వస్తాడే' అంది. 'మీ నాన్నమ్మా వస్తున్నాడు' అంది పారమ్మ.

అంటూనే నాలిక కరుచుకుంది తొందర పడి అనాలోచితంగా అన్నానేమో అనుకుని. సీతి కిప్పుడు ప్రశ్నల కొదవ తీరిపోయింది. పారమ్మ నోటినుంచి మాట రావటమే కష్టం. వచ్చిందంటే దానిమీద ప్రశ్నలు బహు తేలికగా అల్లవచ్చు. సీతి వెంటనే అందుకుని 'మన నాన్న ఎక్కడ వున్నాడే యిప్పుడు' అంది. పారమ్మకు ఆ మాటలు అంతగా రుచించటం లేదు. అంతటితో ఆపుదామనుకుని సమాధానం చెప్పకుండా వూరుకున్నా. కొంగుపట్టి లాగి సమాధానంకోసం తెగ వేధి స్తూంది. పారమ్మ మొదటికే మోసం తెచ్చింది. వూరికే తమాషా కన్నాను సీతి...మనకి అసలు నాన్నలేడు' అంది. సీతికి ఆ సమాధానం సంతృప్తి కలిగించిందనే చెప్పాలి. 'అట్లాగా అమ్మా...యింకా మనకి నాన్న వున్నాడనుకున్నా' అంది. పారమ్మ మనసు అగ్నిపర్వతంలోపల కుతకుతా వుడుకుతున్న లావా లాగుంది. పైకి మటుకు నింపాదిగా వుంది. సీతి అయిదు నిమిషాలసేపు చకచకా నడుస్తున్న పారమ్మ భుజంమీద పడుకుంది గాని తర్వాత భరించలేక పోయింది.

'అమ్మా' అంది గోముగా 'నన్ను ఎక్కడికో పంపించ మన్నా ఉంటీ సెట్టి' పారమ్మ సీతి స్థాయిలోనే వుంది ఆలోచనలో 'తమాషా కడిగాడే...నిన్నెక్కడికి పంపిస్తాను నా దగ్గరే వుంటావు' అంది. సీతి

సంతృప్తి సూచకంగా నవ్వింది. పారమ్మ గూడా నవ్వింది. ఆ నవ్వు మసులుతున్న పాలలోని మీగడ తెరకలా వుంది.

మేడ వాకిలి యింకా పది గజాలువుంది అనగానే, టపాకాయ వకటి పెద్దశబ్దం చేస్తూ పేలిపోయింది. సీతి పారమ్మ చంకలో నుంచి కిందకు జారిపోయింది. 'అక్కడినుంచి నడిచి వస్తానంటూ' పారమ్మ అభ్యంతర పెట్టలేదు. వాకిట్లోనే నిలబడ్డ యింటి యజమానురాలు పారమ్మ ముఖాన తళుకుమంటున్న కుంకుమ వంకచూచి విస్తుపోయింది. ఆ తత్తర బాటులో పారమ్మ లోపలకు వస్తుంటే పక్కకు తప్పుకుంది గాని అడ్డు పెడదామనిగాని, పెట్టాలనిగాని తోచలేదు. చరచరా లోపలకు పోతున్న పారమ్మను పిలిచి-

'ఏమే పారమ్మా...యిట్లా తయారయ్యావు యివ్వాళ' అంది పారమ్మ ముఖంవంక సూటిగా చూస్తూ, పారమ్మ మనసారా నవ్వింది. ఆవిడ వంకచూస్తూ 'బాగానేవున్నా గదూ...యివ్వాళ' అంది.

'బాగానే వున్నావులే...ముఖాన బొట్టేమిటి... ఈ అవతార మేమిటి' అంది ఆశ్చర్యపోతూ. పారమ్మ ముఖంలో కొంచమయినా ఆశ్చర్యం కనపడలేదు: కొంగు లాగుతున్న సీతిని ఎడంచేత్తో పక్కకు తోసేస్తూ 'వారు వచ్చారండి యీ వూరు' అంది.

ఇంటావిడ మూర్ఛ పోయినంత పనయింది. 'నీచ కులాల్లో' మనుష్యులు విధవా వివాహం అంటే వెనుదీయరని, అందుకనే అటువంటి మనుష్యులు అలకా మనుష్యులుగా తయారయారని ఆవిడ నమ్మకం. పారమ్మ ఆ యింట్లో అడుగుపెట్టిన నాటినుంచీ యీనాటి వరకూ పారమ్మ ముఖంలో యింత కళ కళ కనపడలేదు. దానికి కారణం యింటావిడ వూహించ గలిగినదిగాలేదు. ఆమె చిన్ని బుర్రకు తట్టిన వూహల్లా పారమ్మ మళ్లీ పెళ్లీ చేసుకుందనే!

'ఏం పారమ్మా నిన్న రాత్రి పని చెయ్యటానికి రాలేదేం' అంది ఏదైనా మాట్లాడాలనే వుద్దేశంతో, పారమ్మ వంచిన తల ఎత్తలేదు. బొటన వేలితో నేలమీద చతికిలబడి చూపుడు వేలుతో ఏవో గీతలు

గీసి సున్నాలు చుట్టుతోంది. వాటి ఆకారం వివరంగా తెలియకపోయినా గుండ్రటి ముఖంమీద చుక్క పెట్టినట్టుగా వుంది చూడటానికి. యింటావిడ అయోమయంగా నిలబడి కాసేపు అటూ యిటూ చూచింది. ఎవరూ అటు పక్కకు రానేలేదు.

'నిన్నే నే...పిలుస్తే వినబడ్డంలా. చెముడొచ్చిందా ఏది...నిన్న రాత్రి పనికిరాక పోతివి...ఇవ్వాళ గూడా అంట్లన్నీ మసి పూసుకుని అట్లా ఏడుస్తున్నాయి. అల్లా స్తంభంలాగా నిలబడి పోయావేం' అంది వుక్రోషం అంతా వెళ్ళబోస్తూ. పారమ్మ చలించనే లేదు. వక్క అంగుళమయినా కదలలేదు. కాలి పక్కగా చతికిలబడిన సీతిని రెక్క పట్టుకు లేవదీసి కాళ్ళ మధ్యకు తీసుకుని తలను మృదువుగా నిమిరింది. సీతి ఆనందం పట్టలేక తన చిన్ని చేతులతో పారమ్మ కాళ్ళను అటూ యిటూ బాదుతూ గంతులేసింది. యింటావిడ వుక్రోషం పట్టలేక పోయింది తన మాటలు వీసమంతయినా లక్ష్యం యివ్వలేక పోయేటప్ప టికి. రెండడుగులు వెనక్కువేసి 'ఏమిటే పాడుదానా...ఆ అల్లరి...? మట్టి అంతా పైకీ లేస్తుంటేనూ' అంది పిల్లదాని వంక చురచురా చూస్తూ. పారమ్మ మౌనానికి భంగం కలిగింది. యింటావిడ వంక నిర్లక్ష్యంగా వకసారి చూసి యింట్లోకి చూస్తూ 'మా పిల్లేం పాడుది గాదు...అందరి మాటలు పడటానికి,' అంది. యింటావిడ అదిరిపడింది, తూలిపాటువచ్చి స్తంభాన్ని గట్టిగా పట్టుకుని 'అమ్మో అభిమానం వచ్చి పడిందే...నేలనంతా పాడుచేస్తుంటే గూడా ఏమీ అనగూడదా...అం ట్లన్నీ దొడ్లోపడి ఏడుస్తున్నాయి పద..., అంది. పారమ్మ నింపాదిగా చూస్తూ—

'మీ యింట్లో పని చెయ్యటానికి రాలేదు., అన్నది. ఇంటావిడ చిన్నప్పుడు విచిత్ర వ్యక్తుల మనస్తత్వాలను గురించిన కథలనేకం చదివింది. వాటిలో ఏదీకూడా పారమ్మ మాదిరి వ్యక్తిత్వం గల పాత్ర వక్కటీ తగలలేదు. యింటావిడ పారమ్మ వైపు ఎగా దిగా చూసి కథలన్నీ అబద్ధాలు...మనుష్యులను గురించి నిజమైన విషయాలు,

రాయని కథలు ఎందుకు,' అనుకుంది. పారమ్మ కథలను గురించి ఆలోచించటంలేదు. ఎవరి కోసమో నిరీక్షిస్తోంది.

'ఈ పూటకి యింటి పనిచూసి పోతే...రేపటినుంచి మానేస్తే మానేద్దువుగానిలే, అంది యింటావిడ.

'అక్కర్లేదు అమ్మగారూ...యింతవరకూ అందరి యిళ్ళ పని చూస్తున్నాను...యిక నాయింటి పని చూచుకోవలసిన అవసరం వచ్చింది. అంది.

'అదేమిటే అట్లా అంటావు...' యింటావిడ ఏకవచన ప్రయోగం మనసుకు చాలా కష్టంగా తోచింది.

క్షమించాలి అమ్మగారు...ఏమిటే అంటూ నీచంగా పిలవటం నా కంతగా బాగులేదండి.... నన్ను మర్యాదగా పిలిచేటంత ధైర్యం లేక పోతే పేరు పెట్టి పిలవండి!' అంది యింటావిడవంక చూస్తూ. ఆవిడ వక క్షణం నిశ్శబ్దంగా నిలబడి రోడ్డుమీద గుర్రం బండి వంక చూసింది. బండి శబ్దం చేసుకుంటూ పది గజాలు యిల్లు దాటి పైకిపోయి నిలబడింది. బండి తనింటికోసం వచ్చిందేమోనని రెండు నిమిషాలు నిరీక్షించి 'అట్లాగే పారమ్మా....వక విషయం చెప్పు....నువ్వు మళ్ళీ పెళ్లి చేసుకున్నావా...నా దగ్గిర దాపరికమెందుకు....' పారమ్మ యింటావిడ పక్కగా నడచి వెళ్ళి మెట్లమీద చతికిలబడింది. సీతి వెనకాలగా వచ్చి వళ్ళో కూర్చుంది.

'ఏం చెప్పమంటారు....నాకు తెలియని వయసులో అయిన పెళ్ళి నాకు తెలియకుండానే భగ్నమయింది అమ్మాగారూ....నేను బాగా చదువుకున్నదాన్నే....ఒనానొక ప్రలోభాన్ని ఆశించి నా చదువును నా జీవితాన్ని వమ్ముచేసుకుని, యిలా ఆ యింటా....ఆ యింటా పని చేసుకుని బ్రతకటానికని వక నాడు వచ్చాను. ఈనాడు గౌరవం గల ఉద్యోగం ఏదైనా చేసుకుని నా పొట్ట నేను పోసుకోగలిగినా....మాట కుంటుబడింది. కళ్ళు చెమ్మగిలినాయి. సీతిని గట్టిగా చేతుల్లోకి తీసుకుని' 'ఈ పసికందును గురించి యిట్లా వచ్చాను అమ్మగారూ' అంది. ఇంటావిడ కళ్ళ నీళ్ళ

పారమ్మ చూడకుండానే చెరిపి వేసుకుంది. సీతి పారమ్మ కంటినీరు చూడ లేక రోడ్డు వైపుకి దృష్టి మళ్ళించింది. పారమ్మ మళ్ళీ ప్రారంభించింది.

'నా జీవితంలో దేనికోసం ఐతే ఆశించి నా జీవితాన్ని వమ్ము చేసుకున్నానో—దానితో పాటు నా ఆశలు గూడా అడియాసలయినాయి అమ్మగారూ,' ఇంటావిడ నిర్లిప్తంగా వక క్షణం ఆగి-

'అయితే...మరి ఈ అవస్థ అంతా ఎందుకు పారమ్మా....ఇప్పు డేదో పెళ్ళి మాటఅన్నావు....యిప్పుడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నావా?'

'కాదండి నా పెళ్ళి అయి ఆరేళ్లు దాటింది. అదిగూడా నేను కావాలని చేసుకున్నదే.... గాంధర్వ వివాహమనే దానికంటే పైశాచిక వివాహమంటే దానికి విలువ సరియైనది యిచ్చినట్లు అవుతుందేమో.... నా చేతులతో కట్టుకున్న బంధాన్ని ఈ నాడు వదులు చేసుకోవటానికి నిశ్చయించుకున్నాను....నా బిడ్డ జీవితంగూడా నా మాదిరిదే అవటానికి నా కిష్టంలేదు అమ్మగారూ' పారమ్మ చలించి పోయింది. పెదిమలు వికృతంగా కంపిస్తున్నాయి. కళ్ళు ఎర్రగా జ్యోతి లాగా వెలుగు తున్నాయి.

'నా పాపను ఏ దూర తీరానికో తీసుకుపోతాను....నా పాపను వక దారిలో పెట్టగలిగితే నా జీపితాన్ని సంతోషంగా చాలించ గలను అమ్మగారూ' యింటావిడ నిర్లిప్తంగా వింటోంది. పారమ్మ హృదయం కొయ్యలాంటిదని ఆమె అనుకుంటూ వుండేది. అదిగూడా మృధువుగా వుంటుందని ఎన్నడూ తోచలేదు. సీతిని తన కళ్ళ ఎదుట నిర్దాక్షిణ్యంగా బాదిన అనేక సందర్భాలు యింటావిడ మనస్సులో మెదులుతూనే వున్నాయి. అంత కంఠోరమైన కర్కశత్వంలో ఇంత వాత్సల్యం నిగూఢంగా ఇమిడివుందని ఎన్నడూ వూహకు కూడా స్ఫురించలేదు. గట్టి లక్క కరిగి నీరు అవటం ఎన్నిసార్లు చూచినా పారమ్మ హృదయం అటువంటిదని ఎన్నడూ తట్టలేదు. పారమ్మ పడిలో కూర్చుని చప్పట్లు కొడుతున్న సీతిని చూచి 'ఏం పారమ్మా....సీతిని ఎక్కడినుంచో తెచ్చానని చెప్పినట్లు గుర్తు....తండ్రి లేని పిల్ల అనిగూడా చెప్పినట్లు జ్ఞాపకం....' అంది.

‘ఆ మాట నేనిప్పటికీ కాదనలేనుఅమ్మగారూ....ఈ పిల్లకి తండ్రి లేని మాట వాస్తవమే....అయనవున్నా, లేని వాళ్ళలోజత. తల్లిని బ్రతికుండి గూడా ఏంచేయగలిగాను నా పాపకి....యీ నాడు రెండు పూట్లా తిండి పెట్టలేక బాధిస్తున్నాను’ అంది.

‘ఎవడు పారమ్మా ఆ రాక్షసుడు...దరిద్రపు వెధవని....పెళ్లాం బిడ్డలను చూసుకో లేనివాడు....తాళి ఎందుకు కట్టాలి దరిద్రుడాని’

‘అట్లా అనకండి....ఆయన నా భర్త అన్నమాట మరచి మాట్లాడుతున్నారు....తమ భర్తను దూషించటం ఏ స్త్రీగూడా సహించ లేదు అమ్మగారూ....క్షమించండి కఠినంగా మాట్లాడి నందుకు.... అయినా తప్ప లేదు.’

‘ఎందుకు పారమ్మా వెనక వేసుకొస్తావు...మన నిలాంటి మూఢ ప్రేమే, కొసకు ప్రాణాలకి తెస్తుంటుంది...ముల్లును ముల్లుతోనే తియ్యాలి పారమ్మా...నేనే నీ స్థితిలో వుంటే వాడిని...ఛీ...అ పేరును తలవటం గూడా తల వంపుగా వుంది....’

‘పొరబడు తున్నారు అమ్మగారూ...ముల్లును ముల్లుతో తియ్య గలిగినా, బురదను బురదతో కడగలేము...’

ఇంటావిడ యింకా ఏదో మాట్లాడ బోతుంటే ఎక్కడి నుంచో వచ్చిన టపాకాయ వకటి ‘ఢాం’ అంటూ పేలిపోయింది. సీతి వళ్ళోనుంచి వులిక్కి పడి పైకి లేచి పేలిన చోటుకు పరుగెత్తు కుంటూ పోయింది. సీతి ఆశించిన ప్రకారం అక్కడ టపాకాయ వక్కటి గూడా కనపడ లేదు—అన్నీ రంగు కాగితం ముక్కలే. సీతి నాలుగు పక్కలా కలయచూచి, పారమ్మ వైపుకు గబగబా తిరిగి వచ్చేసింది ‘టపాకాయ దొరకలేదే’ అంటూ. పారమ్మ జుట్టు నిమురుతూ గోముగా ‘అమ్మా...టపాకాయ వకటి యియ్యవే’ అంటూ రాగం తీసింది. పారమ్మ జాలిగా పాపవంక చూస్తూ ‘పిచ్చి పిల్ల—మనకు టపాకాయ లెందుకే...గొప్ప వాళ్ళకి గాని అవి’ అంది. ఆ మాట ఎవరి నుద్దేశించి అందో పసిగట్టటానికి ఇంటావిడకు వక క్షణంగూడా పట్టలేదు.

'ఏం పారమ్మా....సీతి మటుకు టపాకాయలు పేల్చ గూడదా.... వరే గోపీ...యిటు రా నాయనా, నాలుగు టపాకాయలు యిచ్చిపో' అంటూ బిగ్గరగా కేక వేసింది. వాకిట్లో నుంచి పరుగెత్తుకుంటూ వచ్చాడు గోపి తల్లి మాట వినబడగానే. పెంపుడు అయినంత మాత్రాన అతనిలో మార్పు ఏమీ రాలేదు. అందరి పిల్లల మాదిరి గానే పరు గెత్తుకుంటూ వచ్చాడు. 'ఏంటి పిన్నమ్మా' అని అరుస్తూ.

'పిన్నమ్మా అంటూ పిలవ వద్దని ఎన్ని సార్లు చెప్పాను... అమ్మా అని పిలవమని చెప్పలా...సీతి చూడు ఎంత ముద్దుగా పిలుస్తుందో.'

పారమ్మ కల్పించుకోక తప్పలేదు. 'సీతికి మిగతా వాళ్ళకి పోల్చ కండి దయచేసి ...నా బిడ్డ నన్ను అమ్మా అని పిలవటంలో ఆశ్చర్యం ఏమీ లేదు.'

గోపి వెంటనే అందుకుని 'అవును పిన్నమ్మా...సీతి పారమ్మ పిల్ల కాబట్టి అమ్మా అని పిలుస్తుంది . రామాపురంలో మా అమ్మని 'అమ్మా' అని నేనుమటుకు పిలవనేంటి' అన్నాడు చేతిలో టపాకాయలు జారి పడకుండా పట్టుకుంటూ...

'పోన్లేరా గోపీ...నాలుగు టపాకాయలు సీతి కివ్వవూ...పేలు స్తుందిట' అంది గోపి వంకచూస్తూ. సీతి ఆశగా అతని వంక చూసింది. 'నన్నెవరు అడిగా రేమిటి యివ్వటానికి? సీతి అడిగితే యిస్తా' అన్నాడు. పారమ్మ వళ్ళో కూర్చున్న సీతి వంకచూస్తూ. సీతి బుంగ ముఖం పెట్టి 'నేనెవ్వర్నీ అడగను...మా అమ్మను తప్ప...చూడవే' అంటూ పారమ్మ గడ్డం పట్టుకుని అడిగింది.

'అట్లా అనగూడదు తప్పమ్మా, గోపీ మీ అన్నయ్యగాదూ... అదే అన్నయ్యలాంటి వాడుగదూ—పిచ్చి పిల్లలాగా అన్నయ్యను అడగ టానికి భయపడుతారా ఎవరన్నా' అంది. సీతి గోపి వంక ఎంతో ఆప్యాయంగా చూసింది. ఇంటావిడ గోపి వంక చుర చురా చూసింది. నిన్నటి దాక యిల్లు కసువు వూడ్చిన పని మనిషి తనతో చుట్టరికం కలిపి మాట్లాడటం ఎంతో అవమాన కరంగా తోచింది. గబుక్కున

కూర్చున్న దల్లా లేచి వచ్చి గోపిని నాలుగు దెబ్బలు వేసి 'ఇక్కడి నుంచి పో...టపాకాయలు వద్దు, ఏమీ వద్దు' అంది. సీతి అతని వంక చూస్తూ 'అన్నా నాకో టపాకాయ ఇయ్యవూ' అంది పారమ్మ వంక సరిగ్గా అడిగానా లేదా అన్నట్లు చూస్తూ' సీతి పారమ్మ వళ్ళోనుంచి లేచి గోపీ దగ్గరకు వెళ్ళింది.

'వద్దు సీతా, నీకు కాల్చటం సరిగ్గా చేతకాదు...నేను కాలుస్తాగా చూడు' అంటూ చేతులోవున్న సీమ టపాకాయను ఎడం చేతిలోవున్న కొబ్బరి పీచు నిప్పుకు అంటించి ఎగర వేశాడు—అది గాలిలోనే 'ఢాం' అంటూ పేలింది. సీతికి అందులో సంతృప్తి కలగలేదు. తన చేతితోనే కాలుస్తే గాని ఆ ఆనందం వచ్చేటట్లు లేదు. గోపి చొక్కా పట్టుకుని 'అన్నయ్యా నాకోటియ్యవూ' అంది. ఇంటావిడ గబగబా గోపిని ఇంకో నాలుగు బాది 'బయటకు పొమ్మని చెప్పలా' అంది. పారమ్మ ఉండబట్టలేక పోయింది.

'ఏమమ్మా...అన్నయ్యా అని పిలవటం గూడా తప్పేనా...బయటికొచ్చి ప్రపంచంలోని మనుష్యులంతా అన్న దమ్ములవంటి వాళ్ళని, అంతా వకటేనని ఉపన్యాసం చెపుతారుగా' అంది. ఇంటావిడ అభిమానం దెబ్బతింది. తననింత ఎదిరించి అడుగుతుందని కలలోగూడా తలచ లేదు. రెక్కలు వచ్చిన పక్షి, గూడు నంటి పెట్టుకుని ఎంత మాత్రమూ వుండదని యింటావిడకు బొత్తిగా తెలియదు.

'ఇందాకటి నుంచి ఏదో మాట్లాడు తున్నావుగదా అని వూరు కుంటే మరీ యిదిగా వుందే. ఇంట్లో వక్క క్షణం గూడ వుండక్కర్లేదు...ఫో అవతలకి' అంది వీధి వాకిలి వైపు వేలు పెట్టి చూస్తూ. పారమ్మ లేచి నిలబడింది సీతిని దగ్గరకు తీసుకుని—

'పోతాను అమ్మగారూ...యిప్పుడే పోతాను...పోయే ముందు అయ్యగారితో వక్కసారి మాట్లాడాలని వుంది...ఆ వక్కటి అనుగ్ర హించండి' అంది కరుణగా చూస్తూ.

'అయ్యగారితో నీకేంపని? నీకు రావలసిన పైకం తెచ్చి ముఖాన పారేస్తాను...మళ్ళీ యింటికి ముఖం చూపించకు. నీ కిక్కడేం పనే...

వాకిట్లోకి పద ..' అని గట్టిగా అరుస్తూ, ఇంటిలోకి పెద్ద పెద్ద అంగలతో వెళ్ళిపోయింది. పారమ్మ నిరామయంగా నాలుగు వైపులా చూచి 'పాపిష్టిదానా...టపాకాయలు నే నిస్తానంటే విన్నావుటే...కాసేపట్లో ఏం కొంప మునిగిపోయిందని' అంటూ చేతికొద్దీ కొట్టింది. 'అడగనే... అడగనే' అంటూ సీతి ఎంతగా అరుస్తున్నా, ఎఱ్ఱగా చెయ్యి కంది పోగానే, అంతవరకు యింటి లోపలి వైపు చూస్తున్న పారమ్మ సీతిని ఎత్తుకుని కన్నీరు సీతి తలవైన జల జలా రాలుస్తూ 'పాపిష్టిదాన్ని— నిన్ను ఎన్ని కొట్టానే' అంటూనే వీపుమీద చెయ్యివేసి నిమిరింది. కదుము గట్టిన వీపు మీద చెయ్యి తగలగానే సీతి 'అమ్మా' అంటూ బిగ్గరగా బావురు మంది.

'ఏమయింది, ఏమయింది' అంటూ వాకిట్లోనుంచి గబగబా పరు గెత్తుకు వచ్చాడు మాధవరావు. అతనే యింటి యజమాని. పారమ్మ అతన్నిచూసి నిర్లక్ష్యంగా పాప తలను మూర్కొన్నది. అతను పారమ్మ దగ్గరగా వచ్చి—

'పారమ్మా...పాపను అంతగా బాదుకుంటావు దేనికి?...చేతులు వూరుకోవూ' అన్నాడు. పాపను అతని చేతుల్లోకి తీసుకుందా మను కున్నాడు. అతనిలో సీతి మీద వాత్సల్యం నిండిపోయి, పొంగి పై కొస్తోంది. మాధవరావు యింకా సన్నిహితంగా వెళ్ళాడు. పారమ్మ నాలుగడుగులు వెనక్కు వేసి—

'పని చాలించుకున్నాను. వెళ్ళిపోతూ చెప్పి పోదామని వచ్చాను' అంది బింకంగా. మాధవరావు చలించి పోయాడు. చేతిరోని సంచి జారిపోయి నేలమీద దబుక్కున పడిపోయింది.

'ఎక్కడికి వెళ్తావు పార్వతీ...ఎప్పుడు ఈ నిర్ణయానికి వచ్చావు?' అన్నాడు అదుర్దాగా.

'క్షమించండి...నా పేరు పారమ్మ....నా పార్వతి వుండే చోటికి వెళ్ళి పోతున్నాను...పారమ్మ చచ్చిపోయింది' అంది. అమ్మ బుజాన వ్రేలాడుతున్న సీతి 'పారమ్మ చచ్చిపోయింది' అన్నమాట విని పారమ్మను వీపుమీద బాదుతూ, 'మీ అమ్మ చచ్చిపోదు...యిక్కడే

వుంది... ఈ, ఈ,' అంటూ ఏడుపు మొదలు పెట్టింది. పారమ్మ సీతి తలను ముద్దుపెట్టుకుని 'పారమ్మ చచ్చిపోయినా మీ అమ్మ నీ దగ్గరే వుంటుందే...మీ అమ్మకు చావులేదు' అంది. మాధవరావు ఏమి మాట్లాడాలో తోచక యింటి వాకిలివైపు చూస్తున్నాడు భార్య అటువైపు వస్తుందేమో నన్న భయంతో,

'ఎంత మారిపోయావు...వక్క రాత్రిలో...యిక్కడ నీకేమి లోపం అనీ...పాపకు చొక్కా తెచ్చాను చూడు' అంటూ కిందపడ్డ సంచిలోనుంచి పూల గౌను వకటి బయటకు తీసి 'యిది నీకోసమేనే సీతి...బాగుందా?' అన్నాడు. సీతి గౌను వంకచూడకుండానే—

'నా కక్కర్లేదు. .మా అమ్మ యిస్తే తప్ప యింకెవరిచ్చినా నాకొద్దు' అంది తల్లి జుట్టును తన వేళ్ళ సందులోకి తీసుకుని మెలికలు వేస్తూ.

'అట్లా అనకూడదమ్మా. నేను చెప్పినప్పుడు తీసుకోవచ్చు... కావాలంటే అమ్మనడుగు' అన్నాడు మాధవరావు పారమ్మ వంక ఆశగా చూస్తూ. పారమ్మ అతని కళ్ళలోకి చూసింది. సిగ్గుతో కుంచించుకు పోయాడు మాధవరావు. దైన్యంగా ఆమె వంక చూస్తూ 'తీసుకోమని చెప్పవూ' అన్నాడు. పారమ్మ సీతిని కిందకు దింపి-

'చొక్కా యివ్వండి....నా చేతితోనే తొడుగుతాను' అంది.

'అల్లా వీల్లేదు పారమ్మా...నా చేత్తో నేనే తొడగాలి. ఆ మాత్రం అవకాశం కలిగించవూ' అన్నాడు. పారమ్మ నీరసంగా నవ్వి—

.మీ రడిగిన ఏ విషయానికి అవకాశం కల్పించలేదు గనక! అయ్యగారిచ్చినప్పుడు తీసుకోవాలి...అయ్య చెప్పినమాట వినాలి, అంది. అయ్య అంటున్నపుడు ఆమె గాత్రం గీరపోయింది. సీతి కనురెప్ప పాటు మాధవరావు వంక చూసింది. తనింటి పక్క గుడిసెలో వుంటున్న రంగి వాళ్ళ నాన్నను అయ్యా అంటూ పిలవటం అనేకమార్లు విన్నది. ఆ పిలుపులో వున్న ఆనందం చూరగొనే అవకాశం కలగనే లేదు సీతికి. చక చకా మాధవరావు కాళ్ళ దగ్గరకు వెళ్ళి 'అయ్యా

చొక్కా ఇయ్యవే' అంది. పారమ్మ వైపుకుతిరిగి 'యిందాక అయ్యా లేడని చెప్పావు అన్నీ అబద్ధాలే' అంది. మాధవరావు పారమ్మ వైపు చూడకుండానే పాపకు గౌను తొడిగేశాడు. రెండడుగులు వెనక్కి వేసి సీతినిచూచాడు. చేతులు చాచి తనవైపు చూస్తోంది. ఎత్తుకుని మనసారా ముద్దుపెట్టుకున్నాడు. 'సీతి చాలా మంచిపిల్ల' అన్నాడు. అవునన్నట్లు తల వూపింది సీతి. వీపు మీద చెయ్యి తగలగానే కెవ్వుమని కేక పెట్టబోయి పారమ్మను చూచి వూరుకుంది. 'అయ్యా నాకు టపాకాయలు-ఇయ్యవూ'...అంది. పారమ్మ అందుకుని 'యిందాక అన్ని కొట్టినా అప్పుడే మర్చిపొయ్యావా...టపాకాయలు కావలసి వచ్చాయిటే' అంటూ గదమాయించింది. సీతి మాధవరావు భుజం నుంచి కిందకు జారివచ్చి పారమ్మను కౌగలించుకుని 'యింక అడగనే' అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

డాబా మీదనుంచి టపాకాయ పకటి వచ్చి వాళ్ళముందర పేలింది. ఎన్నో రంగు కాగితం ముక్కలు యథా ప్రకారం వెక్కిరిస్తూ కనపడ్డాయి. సీతి శ్రుతి బాగా పెంచి ఏడవటం మొదలుపెట్టింది. మాధవరావు సంచీ పట్టుకుని వీధివైపు నాలుగడుగులు వేసి 'వరేయి గోపి సీతికి నాలుగు టపాకాయ లివ్వరా' అంటూ కేకవేశాడు. 'అన్నీ అయిపోయినాయి' అంటూ పైనుంచి సమాధానం వచ్చింది. సీతి ఏడుపు ఇంకా ఎక్కువచేసింది.

ఇంటావిడ పురుక్కుంటూ బయటకు వచ్చి 'యిదుగో తల్లీ నీకు రావలసిన డబ్బులు-యింక పో బయటికి' అంది. ఆవిడ దృష్టిలో గౌను ముందరగా కనపడింది. మాధవరావు వంక చుర చురా చూసి 'అలికీ మనుష్యులకు ఎంత చేసినా వుపయోగం లేదండి...మళ్ళీ మననే కరవొస్తారు' అంది.

'ఏమిటి మనింట్లో పని చెయ్యటానికి రాగానే అలికీ మనుష్యులయి పోయారేం...కులం తక్కువనా...గుణం తక్కువనా' అంటూ పళ్ళు పటపట లాడించాడు మాధవరావు.

'ఆ...అన్నీ తక్కువే...మనతో సాటి పోల్చేవాళ్లా...వాళ్ళకి గూడా ఈ మేడలోనే ఒక భాగం వుండటానికి ఇయ్యక పోయారు. మనతోపాటు తిని తిరిగే వాళ్లు'... మాటల్లో ఎకసెక్కెం తీవ్రంగా ధ్వనిస్తోంది. పారమ్మ వినలేక చెవులు మూసుకుంది.

'ఆ పని చేద్దామనుకుంటున్నాను. ఇక నీ ఆటలు సాగే రోజులు పోయినాయి.... సీతిని ఈ రోజు నుంచీ పెంచుకుంటాను. మనింట్లోనే వుంటుంది. గోపీని పంపిచేస్తున్నాను వాళ్ళ యింటికి.' గోపీ క్రౌర్యంగా అందరి వంకా చూస్తూ ఇంట్లోకి వెళ్ళి సంచీ, కోటు పడేసి, మళ్ళీ వాకిట్లోకి వచ్చాడు. ఇంటావిడ 'అయ్యో....అయ్యో' అంటూ నోరు నొక్కుకుంటోంది. సీతి ఇంకా బిగ్గరగా ఏడుస్తోంది. పారమ్మ నిశ్చేష్టురాలయింది.

'ఏం వీల్లేదు....మొగుడు లేని దాని పిల్లను తెచ్చి పెంచుకోవటానికి ససేమిరా ఒప్పుకోను. వీళ్ళ మొహం మళ్ళీ కనపడటానికి వీల్లేదు. పొండి....మీరంతా బయటకు' అంటూ బిగ్గరగా అరుస్తూ పారమ్మను భుజం పట్టుకు బయటకు తోసింది.

'ఆగండి అమ్మ గారూ....మీ యింట్లో పనికి వచ్చానుగదా అని మాటలంటే పడనని ఇందాకనే చెప్పాను. అదేమాట నా నోటివెంట నాలుగుసార్లు రానీయకండి. నాకు మొగుడున్నాడు....ఉండేవాడు...నా సంగతి నాకు తెలును' దుఃఖం పొర్లివస్తున్న దానిని మింగుకుంటూ 'యిప్పుడు లేడండి అమ్మగారూ...చచ్చిపోయాడు' అని బిగ్గరగా పసిపిల్లవలె రోదించటం ప్రారంభించింది. మాధవరావు అస్పష్టంగా గొణిగాడు. 'లేదు...చచ్చిపోలేదు' అంటూ.

'అవన్నీ నా కక్కర్లేదు...నీ మొహం నాకు చూపించ నక్కరలేదు....నీ డబ్బులు నీ కిచ్చాగా. యింక వెళ్ళిపోవచ్చు...' అంది. వీధి వాకిలి వైపు భుజం పెట్టి మెల్లిగా తోస్తూ. పారమ్మ చలించలేదు. సీతిని చంకలోకి తీసుకుని 'అయ్యకు దణ్ణం పెట్టమ్మా' అంది సీతి రెండు చేతులుకలిపి మాధవరావు వంకచూస్తూ.

'అమ్మా...అయ్య ఉన్నాడన్నావుగదే యిందాక' అంది సీతి అమాయకంగా. పొంగి వస్తున్న దుఃఖాన్ని కడుపులోనే మింగుకుని 'లేదమ్మా మీ అయ్య చచ్చిపోయాడు...ఈయన మీ అయ్యగాదు' అంది. సీతి 'అయ్యా...అయ్యా అంటూ రాగం ప్రారంభించింది.

పారమ్మ సీతిని భుజం మీదనుంచి కిందకు దింపేసింది. నింపాదిగా ఎవరినీ గమనించకుండానే లోగిలిలోవున్న మండిగం దగ్గరకు పోయి, ముఖాన వున్న కుంకుమను చేతిలోకి దులుపుకుంది. బొటనవేలు కన్నీటితో తడిపి, కుంకుమకు అద్దుకుంది. కుంకుమనంతా మండిగానికి పట్టించేసి మాధవరావు వంక చూసి 'నా కుంకుమను ఇచ్చి పోదామనే వచ్చాను...దానితో పని నాకు ఈ రోజుతో తీరపోయింది' అంది. ఇంటావిడ నోరు నొక్కుకుంటూ 'ఆ కుంకుమ నా కొంప కెందుకే నువ్వే తీసుకుపో' అంటూ వక చెంబెడు నీళ్లు మండిగం మీద కొట్టింది. కుంకుమ, పసుపు కలిసిన రంగు నీళ్లు గడపల మీదకుండా కిందకి జారినాయి. పారమ్మ ఆ రంగు నీళ్ళలో తన బింబాన్ని చూచుకుని కంట తడిపెట్టింది. మాధవరావు 'అదేమిటే పారమ్మా. యిదంతా ఏమిటి. ఎక్కడికి పోతున్నావు...యిక్కడివన్నీ విడిచిపెట్టి' అన్నాడు.

'ఇక్కడ నాకేమీ లేవు...నా జీవితం అంతా యిక్కడే హరించిపోయింది. నా సీతి జీవితంగూడా యిలాగే నికృష్టంగా నాశనం చెయ్యటం నాక్కిష్టం లేదు...ఏ దూర తీరానికో తీసుకుపోతాను... నా కడ్డు రానియ్యకండి' అంది.

'కొత్త గౌను తీసుకున్నది గాకుండా...పైగా డబ్బులు గూడా ఎందుకు...పద—యిక నీదారికెవరూ అడ్డురారులే' అంది యింటావిడ గడప మీద పెట్టిన డబ్బులు కొంగులో పెట్టి ముడివేసుకుంటూ.

'నా వక్క మాట విను పారమ్మా...సీతిని నేను పెంచుకుంటా. దానికి ఎటువంటి లోపం కలుగనియ్యను' అన్నాడు మాధవరావు.

'మీ రింతవరకు ఎటువంటి లోపం కలుగ నిచ్చారు గనుక... తల్లినీ పిల్లని వేరు చేద్దామనుకుంటున్నారా' అంది. ఈ సారి మాటలు కఠినంగానే వచ్చినాయి. మాధవరావు తడబడ్డాడు, సీతిని వకసారి

తీసుకుని ముద్దు పెట్టుకుందా మనుకున్నాడు. భార్య రాక్షసిలాగా కనపడింది. పారమ్మ పసిదాని చేతులు మళ్ళీ కలుపుతూ 'అయ్యగారికి దణ్ణం పెట్టు' అంది సీతి కనులలోకి సూటిగా చూస్తూ. మాధవరావు బిగ్గరగా రొప్పుతూ, 'పొండి...అంతా పొండి...నా జీవితంలో ఎవరూ అక్కర్లేదు!' అంటూ యింటిలోకి పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. ఇంటావిడ డబ్బులు కట్టిన ముడిని నడుముకు చుట్టుకుని పారమ్మను; సీతిని వాకిటిదాకా సాగనంపి గొళ్ళెం వేసింది.

సీతి వీధిలోకి అడుగు పెడుతూనే ఎఱ్ఱటి వస్తువు వకదాన్ని చూచి, గబగబా చేతుల్లోకి తీసుకుంది. అన్ని వైపులా పరీక్ష చేసి పారమ్మ వైపుకు చూపిస్తూ 'అమ్మా టపాకాయ దొరికిందే' అంది ఆనందం పట్టలేక. పారమ్మ దానిని తన చేతిలోకి తీసుకుని **చూచింది.** సీతిని చంకలోకి తీసుకుని, హృదయానికి హత్తుకుంటూ, 'ఈ టపాకాయ మోగదమ్మా' అంది. సీతి వలవలా ఏడుస్తూ, 'ఛీ నాకిది వద్దే' అంటూ యింకా గట్టిగా కౌగలించుకుని బావురుమంది.

'అట్లా ఏడవగూడదమ్మా...నీకు మంచి టపాకాయ నేను తెచ్చి పెడతాగా' అంది పారమ్మ బరువుగా **అడుగులు** వేస్తూ.

★